


- ఉమ్మడి జిల్లాలో పార్టీ వెనుకబడిందని మీనాక్షి అసంతృప్తి
- తనకు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష పదవి కావాలన్నకంది శ్రీనివాస్‌రెడ్డి
- నేడు టీపీసీసీ కార్యవర్గం.. మంత్రివర్గంలో చోటుపై సర్వత్రా చర్చ


# నాకు మంత్రి పదవి కావాలి

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిని కోరిన మంచిర్యాల, చెన్నూర్ ఎమ్మెల్యేలు

మంచిర్యాల, మే 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలు మంత్రివర్గంలో చోటు కోసం పట్టు బిగిస్తున్నారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో బుధవారం ఇద్దరు ఎమ్మెల్యేలు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఉమ్మడి ఆదిలాబా ద్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన మీనా క్షి ఒక్కొక్కరితో పది నిమిషాలు మాట్లాడారు. ఈ సమయంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు ఎ మ్మెల్యేలు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఏం జరుగుతుందా? అన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మా రింది. ముందు నుంచి ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరికీ వారు మంత్రి పదవి కోసం పట్టు బిగిస్తూ వస్తున్నారు. రాష్ట్రస్థాయి నుంచి ఢిల్లీ దాకా మంతనాలు చే స్తున్నారు. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్‌తో భేటీలోనూ ఇద్దరు నేతలు ఎవరికీ వారు 'నాకు మంత్రి పదవి కావాలి..' అని అడిగినట్లు సమాచారం. ఈ వ్య వహారం ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

### టీపీసీసీ కార్యవర్గంలో జిల్లాకు ప్రాధాన్యం ఇస్తారా?

ఉమ్మడి జిల్లాలో చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఉన్నా పార్టీలో తమకు సముచిత స్థానం లేదనే నిరాశలో ఉన్నారు. నేడు పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉండడంతో చాలా మంది పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఇటీవల నామినేట్ చేసిన ఎమ్మెల్సీ స్థానాల్లో ఎవరికీ చోటు ఇవ్వలేదు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కాకుండా కరీంనగర్ నాయకులకు బరిలోకి దించారు. దీంతో ఈసారి పీసీసీ పదవులతోపాటు కార్పొరేషన్ల పదవుల కోసం ఆ పార్టీ నాయకులు ఎదురు చూస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కంది శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఇన్‌చార్జి పదవి కావాలని మీనాక్షి నటరాజన్‌కు కోరినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యేలు, ఓటమి పాలైన నాయకులు పార్టీ పదవులపై ఆశలు పెంచుకున్నారు. పీసీసీ పదవులతోపాటు నేడు మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల, చెన్నూర్‌తోపాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. దీంతో ముగ్గురిలో పార్టీ అధిష్ఠానం ఎవరిపై మొగ్గు చూపుతుందన్నది ఆసక్తిగా మారింది. ఈ ముగ్గురిలో ఎవరికైనా ఒకరికే పీసీసీ కార్యవర్గంలో చోటు కల్పించే అవకాశాలు ఉన్నాయి. పార్టీ పదవి ఎవరికి వస్తుందో వారికి ఇక మంత్రివర్గంలో చోటు లేనట్లేననే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భేటీలో మీనాక్షి నాటరాజన్ ఉమ్మడి జిల్లాలో ఇటీవల పార్టీలో చోటుచేసుకున్న అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. కాగజ్‌నగర్‌లో కోనప్ప తిరుగుబాటు, చెన్నూర్‌లో ఎమ్మెల్యేపై ఓ వర్గం బహిరంగ విమర్శలు, కాళేశ్వరంలో ఎంపీ వంశీ ప్రొటోకాల్ రగడ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఓటమిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లాలో పార్టీ వెనుకబాటుకు కారణం ఏంటీ? ఏం చేస్తే బాగుంటుందని నాయకులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు చర్చ జరుగుతున్నది. మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తూ పార్టీని పట్టించుకోవడం లేదా? సమన్వయం లేకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయామా? అంటూ ఆమె జిల్లా నాయకులను ప్రశ్నించినట్లు సమాచారం. పార్టీలో సమన్వయలోపంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు రావడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో పెద్ద కుదుపు తీసుకొచ్చింది. పీసీసీ కార్యవర్గం జరిగాక పదవులు రాని నాయకులు ఏం చేస్తారు. మంత్రి వర్గంలో చోటు దక్కకపోతే ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగుర వేస్తారా? వేరే పార్టీలో చేరుతారా? అన్నది ఆసక్తిగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తాయా? లేకపోతే జిల్లాలో అంతర్గత కుమ్ములాటలకు దారి తీస్తాయా? అన్నది తేలాల్సి ఉంది.



- వచ్చిన దరఖాస్తులకు.. మంజూరైన యూనిట్లకు కుదరని పొంతన
- సిబిల్ స్కోర్‌కు ముడిపెట్టడంతో అనర్హులుగా మారుతున్న యువత
- మంజూరైన యూనిట్ల కంటే అర్హులుగా ఎంపికయ్యే వారే అధికం
- ఏం చేయాలో తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

వచ్చిన దరఖాస్తులు 1.54 లక్షలు
మంజూర్రైన యూనిట్లు 50 వేలు

# రాజీవ్ యువ వికాసం అందేనా?

## ఆలస్యంగా సాగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియ

## ఇంకా.. కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక

మంచిర్యాల, మే 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలు నత్తనడకన సాగుతున్నది. జూన్ 2వ తేదీ నుంచి అర్హులైన వారికి మంజూరు పత్రాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మే 28 తేదీ బుధవారం నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. కా నీ.. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపిక ప్ర క్రియ కొలిక్కి రాలేదు. దీంతో తెలంగా ణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వ తేదీన మంజూరు పత్రాలు ఇవ్వడంపై నీలినీడలు కమ్ముకున్నా యి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ల్లో 1,54,210 మంది యు వ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఉ మ్మడి జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లు 50 వేలు కూడా లేదని తెలుస్తున్నది. వచ్చిన అప్లికేషన్లకు మంజూరైన యూనిట్లకు భారీ తేడా ఉండడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. పథకం నిబంధనలను అనుసరించి ఒంటరి మహిళలు, అత్యంత వెనుకబడిన పేదలు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ మేరకు వచ్చిన దరఖాస్తుల్లో ఈ కేటగిరీల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించిన అధికారులు కలెక్టర్ల ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఈ కేటగిరీలో తప్ప ఇతర దరఖాస్తుల్లో లబ్ధిదారుల ఎంపికపై ఇప్పటికీ స్పష్టత రాలేదని సమాచారం.

### సిబిల్ స్కోర్ వెరిఫికేషన్‌తో ఆలస్యం

రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌లవారీగా విభజించారు. కులాలవారీగా రిజర్వేషన్లు అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. తొలి విడుతలో రూ.50 వేలు, రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకున్న వారికే మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. కులాల రిజర్వేషన్ల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి రావడంతో ప్రక్రియ ఆలస్యం అవుతున్నది. వచ్చిన దరఖాస్తులను మండల అధికారులు బ్యాంకర్లకు అందించారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ చెక్ చేసి, వారి పేరుపై ఏమైనా రుణాలు ఉన్నాయా? పరిశీలించి తిరిగి మండల అధికారులకు అప్పగించాలి. అలా సిబిల్ స్కోర్ బాగా ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి కలెక్టర్లకు ఆ జాబితాను పంపించారు. చాలా మండలాల్లో ఇంకా బ్యాంక్ సిబిల్ వెరిఫికేషన్ ప్రక్రియే పూర్తి కాలేదని తెలిసింది. అధికారికంగా ఇప్పటివరకు ఇచ్చిన సమాచారం మేరకు నిర్మల్ జిల్లాలో మొత్తం 35,184 దరఖాస్తులు రాగా 27,939 అప్లికేషన్లను బ్యాంక్ వెరిఫికేషన్‌కు పంపించారు. ఆదిలాబాద్ జిల్లాలో 42,352 దరఖాస్తులు రాగా 11,178, ఆసిఫాబాద్ జిల్లాలో 30,722 అప్లికేషన్లు రాగా 16,558, మంచిర్యాల జిల్లాలో 45,952 దరఖాస్తులు రాగా, 41,197 దరఖాస్తులు బ్యాంక్ వెరిఫికేషన్‌కు పంపించారు. వెరిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో 60 శాతం కూడా పూర్తికాలేదని తెలిసింది. ఒకటి, రెండు బ్యాంక్‌లను ఆరా తీసినప్పుడు బుధవారం నాటి 40 శాతం నుంచి 60 శాతం వెరిఫికేషన్ పూర్తి చేశామని, ఆ వివరాలు అధికారులకు పంపించామని చెప్పారు. ఇలా బ్యాంక్ వెరిఫికేషన్ పూర్తయి, ఆ వివరాలు అధికారులకు రావడానికే నాలుగైదు రోజుల సమయం పట్టేలా ఉంది.

### మంజూరైనవి తక్కువ యూనిట్లు

దరఖాస్తులను సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టడంతో చాలా మంది ఆశావహులు అనర్హులుగా మారిపోతున్నారు. ఇలా ఎంత వడబోసినా అర్హులయ్యే వారి సంఖ్య సర్కారు మంజూరు చేసిన యూనిట్ల కంటే అధికంగా ఉంటుంది. అర్హులుగా ఎంపికయ్యే వారికి ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకు అసలు పొంతనే లేకుండా పోతుందని తెలిసింది. నిర్మల్ జిల్లాలో 35 వేల మంది దరఖాస్తు చేసుకుంటే అన్ని కార్పొరేషన్లకు కలిపి 11,039 యూనిట్లు, ఆసిఫాబాద్ జిల్లాలో 42 వేల మంది దరఖాస్తు చేసుకుంటే 13,879 యూనిట్లకు మంజూరు ఇచ్చారు. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఈ వివరాలు చెప్పడానికి అధికారులు సుముఖత వ్యక్తం చేయలేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని అదయ్యాక పూర్తి వివరాలు ఇస్తామని చెప్పారు. ఆ రెండు జిల్లాల్లో కలిపి ఓ 20 వేల యూనిట్లు అనుకున్నా వచ్చిన దరఖాస్తుల్లో 35 శాతం మందికి కూడా లబ్ధిచేకూరేలా లేదు. తక్కువ యూనిట్లు రావడంతో ఎవరిని ఎంపిక చేయాలనే సందిగ్ధం నెలకున్నది. అర్హులైన వారి చాలా మంది ఉన్న నేపథ్యంలో కొందరిని పక్కన పెట్టి కొందరికే ఇస్తే మిగిలిన వారి నుంచి వ్యతిరేకత వచ్చే ఛాన్స్ లేకపోలేదు. దీంతో ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే అంశంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తీరా ఎంపిక చేశాక అధికార పార్టీ వారికే ప్రియార్టీ ఇచ్చారంటూ మిగిలిన వారు నిలదీస్తే ఏం చేయాలన్నది అర్థం కాకుండా పోయింది. సిబిల్ స్కోర్ వెరిఫికేషన్, అర్హులు ఎక్కువ మంది ఉండడం, సర్కారు మం జూరు చేసిన యూనిట్లు తక్కువగా ఉండడం మంజూరు పత్రాల జారీకి అడ్డుగా మారింది. ఈ స మస్యలను పరిష్కరించుకుని మంజూరు పత్రాలు ఇవ్వడం.. జూన్ 2వ తేదీ నాటికి పూర్తయ్యేలా లేద ని అధికారులు చెప్తున్నారు. ఒకవేళ హడావుడి చేసి మొదలుపెడితే మిగిలిన పథకాల మాదిరిగానే జనం నుంచి వ్యతిరేకత రావొచ్చని భావిస్తున్నారు. ఈ పథకం అమలు విషయంలో ప్రభుత్వం హడావుడి చేసి అబాసుపాలవుతుందా? లేక నిధానంగా ప్ర క్రియ మొత్తం పూర్తి చేసి లబ్ధిదారులందరిని సంతృ ప్తి పరుస్తుందా? ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్తుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

ఉమ్మడి జిల్లాలో కార్పొరేషన్ల వారిగా దరఖాస్తులు..

| జిల్లా | ఎస్సీ | ఎస్టీ | బీసీ | ఈబీసీ | మైనార్టీ | క్రిస్టియన్ మైనార్టీ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 8,585 | 11,327 | 16,863 | 483 | 5,058 | 36 | 42,352 |
| ఆసిఫాబాద్ | 6,939 | 7870 | 12,590 | 413 | 2,877 | 33 | 30,722 |
| మంచిర్యాల | 15,321 | 3,633 | 23,755 | 766 | 2,388 | 89 | 45,952 |
| నిర్మల్ | 7,350 | 3,627 | 17,288 | 928 | 5,926 | 65 | 35,184 |



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు (ఫైల్)

# పెరిగిన మద్దతు లభించేనా?

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిర్వాకం

- ఎనిమిది శాతం తేమ ఉంటేనే ధర
- నాణ్యత పేరిట క్వింటాలుకు రూ.100 కోత
- నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్, మే 29(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ఏటా పంటలకు మద్దతు ధర పెంచుతోంది. దీంతో రైతులు తమకు మద్దతు ధర లభిస్తోందని ఆశించినా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వాకం ఫలితంగా రైతులకు మద్దతు ధర లభించడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఏటా వానకాలంలో 4 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. వివిధ కంపెనీలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాలను వాడతారు. జూన్ మొదటి, రెండో వారంలో విత్తనాలు వేస్తారు. అక్టోబర్ రెండు, మూడో వారం నుంచి పత్తిని ఏరుతారు. సాగులో అన్ని పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

### తేమ నిబంధనతో నష్టం

పత్తిని సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది. ప్రైవేటు వ్యాపారులు కూడా కొనుగోలు చేస్తారు. బేళ్ల ధరకు అనుకూలంగా ప్రైవేటు వ్యాపారులు ధర చెల్లిస్తారు. ఏటా జిల్లాలో పది మార్కెట్ యార్డుల్లో సీసీఐ పంటను కొనుగోలు చేస్తుంది. సీసీఐ కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాల్సి ఉండగా.. నిబంధనల పేరిట రైతులకు కుచ్చుటోపి పెడుతున్నది. పత్తిలో 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తారు. 8 శాతానికి మద్దతు ధర చెల్లిస్తారు. 9 నుంచి 12 శాతం వరకు క్రమంగా కోతలు విధిస్తారు. గతేడాది క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర ఉండగా 8 శాతం తేమకు మాత్రమే చెల్లించారు. 9 శాతం ఉంటే రూ.7446, 10 శాతం ఉంటే రూ.7325, 11 శాతం ఉంటే రూ.7296, 12 శాతం తేమ ఉంటే రూ. 7221 చెల్లించారు. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలు చేయడానికి నిరాకరిస్తారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయించి నష్టపోయారు.

### నాణ్యత పేరిట కోతలు

తేమ శాతం 8 ఉన్నా.. నాణ్యత సరిగా లేదంటూ క్వింటాలుకు రూ.100 తగ్గించారు. దూది పింజ పొడువు సరిగా రాకపోవడంతో సీసీఐ అధికారులు ధరను తక్కువ చేసి కొనుగోలు చేశారు. జిల్లాలో పత్తి సాగుకు అనుకూలమైన భూములు, వాతావరణ పరిస్థితుల కారణంగా నాణ్యమైన పంట పండుతుంది. రైతులు పండించిన పత్తి ఆసియాలోనే నాణ్యమైనదిగా నిపుణులు గుర్తించారు. తాము ఎన్నో సంవత్సరాల నుంచి పత్తిని సాగు చేస్తున్నామని, నాణ్యమైన పత్తిని పండిస్తున్నా సీసీఐ అధికారులు పంట బాగా లేదని కోతలు విధించడం సరికాదని రైతులు అంటున్నారు. గతేడాది పత్తి క్వింటాలుకు రూ.7521 ఉండగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాలుకు రూ.589 పెంచి రూ.8110 గా ప్రకటించింది. కేంద్రం ధరలు పెంచుతున్న సీసీఐ అధికారుల విధిస్తున్న నిబంధనల వల్ల తాము నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఎలాంటి కోతలు లేకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### సీసీఐది కార్పొరేట్ వ్యాపారం..



కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు ఏటా ధరను పెంచుతున్నది. పెరిగిన పెట్టుబడుల కారణంగా కేంద్రం పెంచుతున్న ధరలు ఏ మాత్రం గిట్టుబాటు కావు. పెంచిన ధరలు జిల్లాలో రైతులకు లభించడం లేదు. పత్తి కొనుగోళ్లలో సీసీఐ కార్పొరేట్ సంస్థగా వ్యవహరిస్తూ రైతులను నష్టాలకు గురి చేస్తున్నది. తేమ పేరిట కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చెల్లించడం లేదు. పింజ పొడువు సరిగా లేదంటూ క్వింటాలుకు రూ.100 తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ అధికారుల వేధింపుల కారణంగా రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి నష్టపోతున్నారు.

- సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, ఆదిలాబాద్


# 325 క్వింటాళ్ల మక్కలు చోరీ

నర్సాపూర్ (జీ), మే 29 : 325 క్వింటాళ్ల మక్కలతో కూడిన లోడును గత నెల 23వ తేదీన దొంగతనం చేసి, విక్రయించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన నర్సాపూర్(జీ) పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్నది. కల్లూరు గ్రామానికి చెందిన బొద్దుల శ్రీనివాస్‌కి చెందిన 325 క్వింటాళ్ల మక్కలను గత నెల ఏప్రిల్ 23వ తేదీన ఒక వ్యక్తి లారీలో లోడ్ చేసి తీసుకెళ్తానంటూ మోసగించి మక్కలను చోరీ చేశాడు. చోరీ జరిగిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు ఈ నెల 13వ తేదీన నర్సాపూర్(జీ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన నర్సాపూర్ పోలీసులు ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. విచారణలో నిజామాబాద్‌లోని రాజీవ్‌నగర్ తండాకు చెందిన లారీ డ్రైవర్లు బదావత్ సంతోష్, కంఠేశ్వర్‌కు చెందిన అబ్దుల్ రజాక్‌లు 325 క్వింటాళ్ల మక్కల లోడును కామారెడ్డి సమీపంలో ఉన్న స్నేహ చికెన్ పార్మ్ గోదాంకు పీవీ ఏజెన్సీ ద్వారా విక్రయించి రూ.7.48 లక్షలను సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో గురువారం భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తామే 325 క్వింటాళ్ల మక్కలను దొంగతనం చేసి విక్రయించినట్లు అంగీకరించారు. వీరి నుంచి రెండు లారీలు, మూడు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరి కొంత మంది ఇతరుల పాత్ర ఉన్నట్లు గుర్తించామని, వారిని కూడా విచారించి అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిధులను ఆలయాలకు కేటాయించిన ఘనత కేసీఆర్ దే

- మాజీ మంత్రి జోగు రామన్న

బేల, మే 29 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాలకు నిధులు కేటాయించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవంతోపాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. మార్కండేయుడి వద్ద నాన్న గోత్రం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన వంతుగా రూ.21 వేల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి రూ.కోట్లు వెచించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవుత్ మనోహర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు సతీశ్ పవర్, విపిన్, మాస్క తేజీరావ్, బాల్ చందర్, దేవన్న, దీపక్‌దీపక్ గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

# ఆదిలాబాద్ ఎమ్మెల్యేకు పిచ్చి ముదిరింది

- మాజీ మంత్రి జోగు రామన్న
- సోషల్ మీడియా వేదికగా ఫైర్



సోషల్ మీడియాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 29 : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిచ్చి ముదిరినట్లుగా వ్యవహరిస్తున్నాడని మాజీ మంత్రి జోగు రామన్న సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్నం బ్రిడ్జి టెండర్లతోపాటు, రూ.40 కోట్ల రోడ్డు సౌకర్యం, జైనథ్ సబ్ స్టేషన్ మంజూరు, జేఎన్టీయూ కాలేజీ వంటి పనులను సాంక్షన్ చేయించినప్పుడు పాయల్ శంకర్ ఎక్కడున్నారో గుర్తు చేసుకోవాలని మండిపడ్డారు. దమ్ముంటే ఆదిలాబాద్‌కు విమానాశ్రమం, జేఎన్టీయూ కాలేజ్ సబ్‌స్టేషన్‌తోపాటు, ఆర్మూర్ రైల్వేలైన్ పనులు పూర్తిచేయడంలో చిత్తశుద్ధి చూపించాలని హితువు పలికారు. ఉపాసనాల ఫోర్‌లేన్ రోడ్డు భోరజ్ వరకు ఎందుకు రాదని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 20 కిలో మీటర్ల దూరంలోనే ఇంత వివక్ష చూపుతున్నప్పుడు, బీజేపీ ఎమ్మెల్యేగా ఆదిలాబాద్‌లో చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.